# వాస్తవాలను వెలికితీసే విశ్లేషణ

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు- దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంఘటనలూ, వాటి పరిణామాల క్రమం నోట్ చేసుకుంటుంటారు. అంతటితో ఆగకుండా వాటి అంతస్సంబంధాలను అధ్యయనం చేసి, మూలకారణాలను గ్రహించటానికి కూడా ప్రయత్నించాలి. అప్పుడే స్వీయ దృక్పథం, నిర్దిష్ట అభిప్రాయం ఏర్పడే అవకాశం ఉంటుంది. అందుకు ఉపకరించే విశ్లేషణ ఇదిగో...!




విజయ శేఖర్

## జాతీయ అంతర్జాతీయ పరిస్థితులపై అవగాహన సాధించడమెలా? 6

సామాజిక వ్యవస్థల అభివృద్ధి, పరిణామాలను పరిశీలించేటప్పుడు పునాది, ఉపరితలం అని రెండు మాటలు తరచుగా వినబడతాయి. ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక సంబంధాలు పునాదిగా ఉంటే- విద్య, సంస్కృతి, కులం, మతం, కుటుంబం, సామాజిక సంబంధాలు ఉపరితలంగా ఉంటాయని ఇపుడు అందరూ అంగీకరిస్తున్న సత్యం. ఇంటికి పునాది గట్టిగా ఉంటే ఉపరితలం బీటలు వారకుండా గట్టిగా ఉన్నట్టే, ఒక సామాజిక వ్యవస్థలో ప్రజలందరి ఆర్థిక పరిస్థితులూ మెరుగ్గా ఉంటే ఉపరితలంలో ఉండే విద్య, కుటుంబం, సంస్కృతి, ఆరోగ్యం తదితర అంశాలు కూడా ప్రగతి వైపు పయనిస్తాయి. పునాది అయిన ఆర్థిక సంబంధాలు అసమానతలతో నిండి ఉన్నట్లయితే ఉపరితలంలోని అంశాలు కూడా సంక్షోభంలో కునారిల్లుతాయి.

సామాజిక వ్యవస్థల్లో కిందిస్థాయిలో ఉన్నవారు నిరంతరం తమ పరిస్థితుల మెరుగు కోసం ప్రయత్నిస్తారు. పైస్థాయిలో ఉన్నవారు యథాతథ పరిస్థితులు (స్టేటస్ కో) కొనసాగాలని కోరుకుంటారు. ఈ పరిస్థితి వైరుధ్యాలను ఏర్పరుస్తుంది. ఈ వైరుధ్యాలే నిత్యం కంటికి కనిపించే సమస్యలు. ఒక సమస్య సామాజిక/ సామూహిక రూపం తీసుకున్నప్పుడు అది ఒక పరిణామం రూపంలో తన ఉనికిని చాటుకుంటుంది. ఇలా చాటుకోవడమే మనం రోజూ చూసే జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు.




### వదంతులతో వలస

గత సంవత్సరం జులైలో అస్సాం ఘర్షణల సందర్భంగా పెద్దవ త్తున 'తిరుగు టపా' వలసల గురించి పరిశీలిద్దాం. 'బోడోలాండ్ టెరిటోరియల్ కౌన్సిల్' (బి.టి.సి.) పేరుతో ఉన్న నాలుగు బోడో జిల్లాల్లో ముస్లిం, బోడో ప్రజల మధ్య జరిగిన హింసాత్మక ఘర్షణలు చివరికి దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి ఈశాన్య రాష్ట్రాల ప్రజలు పెద్దవత్తున సొంత రాష్ట్రాలకు తరలిపోవడానికి దారితీశాయి. అస్సాం రాష్ట్రానికి అక్రమంగా వలస వచ్చిన బంగ్లాదేశ్ ముస్లింలపైన బోడోలు దాడులు చేస్తున్నందుకు ప్రతీకారంగా ఇతర రాష్ట్రాల్లోని ఈశాన్య ప్రజలపై స్థానిక ముస్లింలు దాడులకు పథకం వేశారని ప్రచారం జరిగింది. వేలాది ఈశాన్య ప్రజలు కిక్కిరిసిపోయిన రైళ్లలో తమ రాష్ట్రాలకు తరలిపోయారు. ఆయా రాష్ట్రాల, నగరాల ప్రభుత్వ విభాగాలు, కేంద్రప్రభుత్వం వారి రక్షణకు భరోసా ఇచ్చినా రోజుల తరబడి ఈ తిరుగు వలస కొనసాగింది.



ఈ సమస్యకు బంగ్లాదేశీ ముస్లింల అక్రమ వలసలే కారణం కనుక వారిని వెళ్లగొట్టాలని డిమాండ్లు తలెత్తాయి. కానీ సమస్యకు కారణం ఇది కాదని ఆ తర్వాత 'నేషనల్ మైనారిటీ కమిషన్' (ఎన్.ఎం.సి.) బృందం పర్యటన జరిపి చేసిన విచారణలో తెలిసింది. ఘర్షణల్లో బంగ్లాదేశ్ ముస్లింల పాత్ర లేదని; స్థానిక బోడోలు, స్థానిక ముస్లింలను వెళ్లగొడితే రాష్ట్రం వస్తుందన్న అంచనాతో దాడులు చేశారని ఎన్.ఎం.సి. బృందం తెలిపింది. మాజీ బోడో మిలిటెంట్ల వద్ద మిగిలిపోయిన ఆయుధాలు ఘర్షణల్లో వారికి ఆధిపత్యాన్ని ఇచ్చాయని పేర్కొంది. స్థానిక ముస్లింలను హింసాత్మక దాడులతో వెళ్లగొడితే రాష్ట్రం రాదని వారిని హెచ్చరించాలని కేంద్రప్రభుత్వాన్ని ఎన్.ఎం.సి. కోరింది.

### కొంత లోతుగా పరిశీలిస్తే...

సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు ఈశాన్య ప్రజలకు ఇతర రాష్ట్రాల్లోని నగరాల్లో పరిమిత విద్యార్హతలకే మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ఉపాధి సౌకర్యాలను కల్పించాయి. ఈశాన్య ప్రజలు సాధుస్వభావులనే పేరుండడం వల్ల వారి స్త్రీలకు బ్యూటీపార్లర్ కార్మికురాళ్లుగా, సేల్స్‌గర్ల్స్‌గా ఉపాధి లభించింది. పురుషులు హోటళ్లలో వంటవారుగా, బేరర్లుగా, సెక్యూరిటీ గార్డులుగా, ఇంజినీరింగ్ పరిశ్రమల్లో కార్మికులుగా ఉపాధి పొందారు. ఈ నేపథ్యంలో ఈశాన్య ప్రజలు స్థానిక వ్యవసాయ పనులు వదిలేసి లక్షల సంఖ్యలో ఇతర రాష్ట్రాలకు వలసపోయారు. దానితో స్థానిక వ్యవసాయ పనుల్లో కూలీలకు కొరత ఏర్పడింది.

ఈ కొరతను బంగ్లాదేశ్ ముస్లింలు పూడ్చారు. ఇది పరోక్షంగా పరస్పర అంగీకారంతో జరిగిన వ్యవహారం. అస్సాంలో విదేశీయుల వలస ఒక సమస్యే అయినప్పటికీ ఈసారి మాత్రం దానికి పాత్ర లేదు. ప్రత్యేక రాష్ట్రంగా స్వయంపాలన కోసం బోడోలు చేసిన ప్రయత్నం హింసాత్మక ఘర్షణల రూపంగా తీసుకోగా వాటికి స్వార్థశక్తులు మతం రంగు పులిమి ప్రయోజనం పొందే ప్రయత్నం చేశాయి.

ఈ సమస్యలో ఆర్థిక ప్రయోజనాలు వివిధ పరిణామాలకు చోదకశక్తిగా పనిచేశాయనేది మనం గమనించవలసిన విషయం. పైకి మత ఘర్షణలుగా, తిరుగు వలసలుగా కనబడిన పరిణామాలకు బోడోల ప్రత్యేక రాష్ట్ర కాంక్ష 'ట్రిగ్గర్ పాయింట్'గా పనిచేసింది. రాష్ట్రకాంక్ష వెనుక స్థానిక ధనికుల ప్రయోజనాలున్నాయి. దేశంలోని సూపర్ ధనికవర్గాల వశంలోని స్థానిక ఆర్థిక వనరుల నుంచి న్యాయమైన భాగం దక్కాలంటే స్వయం పాలన దానికి మార్గమని వారి ఆశ. ఇక ఈశాన్య రాష్ట్రాల ప్రజలు కూడా మెరుగైన ఆర్థిక జీవనం కోసమే ఇతర రాష్ట్రాలకు వలసపోయారు. బంగ్లాదేశ్ ముస్లింలు కూలీ డబ్బుల కోసమే వలస వచ్చారు తప్ప ముస్లింలుగా కాదు. వీరు ఒకప్పుడు బెంగాల్ ప్రజలే. మనకి విదేశీ వలసగా కనపడినా వారికది పనుల కోసం పక్క ఊళ్లకు వెళ్ళడం.

ఈ సమస్యను రాజకీయపార్టీలు సైతం రాజకీయ ప్రయోజనాలకు వాడుకోజూశాయి. వారికి మతసంస్థలు తోడుగా నిలిచాయి. ఆ సంస్థలు, పార్టీలకు ఓట్లు, అధికారం తద్వారా ఆర్థిక ప్రయోజనాలు కావాలి. ఫలితంగా సెల్‌ఫోన్లలో వదంతులు వరదలెత్తాయి. ఈశాన్య ప్రజలేమో తిరుగు వలసల్లో వరదెత్తారు. సమస్యను కేంద్రం పాక్ పైకి నెట్టివేసింది. ఆ దేశస్థులు పాత వీడియోలు, మార్ఫ్‌డ్ ఫొటోలు ఇంటర్నెట్‌లో పెట్టడం వల్ల ఘర్షణలు జరిగాయని కేంద్రం ప్రకటించింది.

ఈశాన్య ప్రజల తిరుగు వలస చుట్టూ జరిగిన ప్రతి పరిణామంలోనూ ఆర్థిక ప్రయోజనం పునాదిగా పనిచేయడం గమనించవచ్చు. మిగిలిన రాజకీయ (రాజకీయ పార్టీల, నాయకుల స్పందనలు), సాంస్కృతిక (మతపరమైన భావోద్వేగాలు, వదంతులు), భౌతిక (తిరుగు వలసలు, కిక్కిరిసిన ప్రయాణాలు) పరిణామాలు అన్నీ ఆ ఆర్థిక ప్రయోజనాలకు అనుబంధంగా ఉపరితలంలో జరిగినవే. ఉపరితలం అంటే పైకి కనబడేవి అని. ఉపరితల పరిణామాలను చూసి నేరుగా ఒక అవగాహనకు వస్తే అవి మత (సాంస్కృతిక) ఘర్షణలుగా కనిపిస్తాయి. కానీ లోతుల్లోకి వెళితే అవి ఆర్థిక ఘర్షణలని తేలతాయి.

### ఏవి ప్రధానం?

రాజకీయ, సాంస్కృతిక అంశాలు ఉపరితలంలో ఉంటాయి గనుక వెంటనే మన దృష్టికి వస్తాయి. పునాది, ఉపరితలాలను పరిశీలించేటప్పుడు వ్యక్తమయ్యే ఈ (సామాజిక) పారలాక్స్ దోషం జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను పరిశీలించేటప్పుడు కూడా వ్యక్తం అవుతుంది. ఆ దోషం పైకి కనబడని 'ఆర్థిక వైరుధ్యాలు ప్రధానం' అన్న అంశాన్ని విస్మరించి ఉపరితలంలోని కులం, మతం, ప్రాంతం లాంటి ఎక్కువ, తక్కువలే ప్రధానమనే దురభిప్రాయాన్ని కలిగిస్తుంది. కొంత లోతుగా చూస్తే తప్ప ఆర్థిక వైరుధ్యాలు సమాజంలో జరిగే ఇతర పరిణామాలకు 'ట్రిగ్గర్ పాయింట్'గా పనిచేస్తున్నాయని అర్థం కాదు.

ఇక్కడ ఆర్థిక వైరుధ్యాలు అన్న అంశాన్ని వివిధ పార్శ్వాలుగా అర్థం చేసుకోవచ్చు. ఆర్థిక పరిణామాలు, ఆర్థిక సంబంధాలు, ఉత్పత్తి సంబంధాలు (ఆర్థికం అంటే ఉత్పత్తులకు ఉన్న విలువే), ఉత్పత్తి సాధనాలు (భూములు, పరిశ్రమలు, సేవలు), ఆర్థిక వ్యవస్థ మొదలైనవన్నీ సామాజిక వ్యవస్థ పునాదిలోని వివిధ పార్శ్వాలను తెలియజేస్తాయి.

ఒక దేశ సామాజికార్థిక వ్యవస్థలో ఆర్థిక వ్యవస్థ పునాది అని అర్థం అయితే పైకి సంక్లిష్టంగా కనిపించే ఇతర పరిణామాలన్నీ దూదిపింజల్లా గాలిలో తేలుతూ వేటికవే స్పష్టంగా కనిపిస్తాయి. అంతర్జాతీయ పరిణామాలకు కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. వివిధ దేశాల ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలే వారి విదేశీ విధానాలనూ, అంతర్జాతీయ రాజకీయ వేదికలపై అనుసరించే ఎత్తుగడలనూ, ప్రాంతీయ జియో-పొలిటికల్ సైనిక వ్యూహ ప్రతివ్యూహాలనూ నిర్ధారిస్తాయి. అలాగే దేశంలోని వివిధ ప్రాంతాల, జాతుల, భాషా ప్రజల ఆర్థిక ప్రయోజనాలే పునాదిలో సంఘర్షిస్తూ ఉపరితలంలో రాజకీయ, సాంస్కృతిక, ప్రాంతీయ, జాతీయ, భాషా వైరుధ్యాలుగా, తగాదాలుగా మనకు కనిపిస్తాయి.

రచయిత జాతీయ అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ సైట్ http://teluguvartalu.com నిర్వాహకులు.